

విలేకరులతో మాట్లాడుతున్నబీఆ ర్ఎస్వీజి ల్లా నాయకుడుశేఖర్

## స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

- బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు శేఖర్

కొల్లాపూర్, ఏప్రిల్ 7: రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్ షిప్ బకాయిలను తక్షణమే విడుదలచేయాలని బీఆర్ఎస్వీ నాగర్‌కర్నూల్ జిల్లా నాయకుడు డి.శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సంఘం నాయకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్‌లు చెల్లించక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీసీల నియామకాల్లో రాజకీయ జోక్యం లేకుండా అర్హతలు గల వారిని నియమించాలన్నారు. పరిశోధక విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫెలోషిప్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## పట్టింపులు వీడి పాలనపై దృష్టి పెట్టండి

- టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ



విలేకరులతో మాట్లాడుతున్నదే వనికు మార్‌మాదిగ

కొల్లాపూర్, ఏప్రిల్ 7 : పంతాలు, పట్టింపులు వీడి ప్రజాపాలనపై దృష్టి సారించాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఆదివారం సంఘం నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఎన్నికల కోడ్ పేరుతో దాటవేడం సరికాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేయడం, కేసీఆర్‌ను చర్లపల్లి జైలుకు పంపిస్తామన్నడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ తెలంగాణ సాధించక పోతే మీరు పీసీసీ అధ్యక్షుడిగా సీఎం అయ్యేవారా అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణం అమలుచేయాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మోసకారి కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధిచెబుతారన్నారు. సమావేశంలో శివ, దేవనివిష్ణు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఊర్కొండ, ఏప్రిల్ 7 : మండలంలోని రాంరెడ్డిపల్లిలో ఆదివారం ఎంపీటీసీ, కలిమిచెర్ల గోపాల్ గుప్తా కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సుమారు 100 మీటర్లు తన స్వంత నిధులతో రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సుజీవన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, లింగప్ప, తిరుపత్‌రెడ్డి, శ్రీనువాస్‌యాదవ్, జంగయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 7: మండల కేంద్రం సమీపంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై సతీశ్ మాట్లాడుతూ ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో మద్యంసేవించి పట్టుబడ్డవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## కైలాసవాహనంపైశ్రీ శైలేశుడు



శ్రీశైలంలో పాల్గొన్న అశేషభక్తులు

శ్రీశైలం, ఏప్రిల్ 7: శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు ఆదివారం ఉదయం స్వామిఅమ్మవార్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి యాగశాలలో చండీశ్వరపూజ, మండపారాధన, జపానుష్టానాలు, రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం భ్రమరాంబ అమ్మవారికి విశేష కుంకుమార్చన, నవావరణార్చన, చండీహోమం నిర్వహించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను కైలాస వాహనంపై ఊరేగించారు. సోమవారం స్వామి అమ్మవార్లకు ప్రభోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్వో శ్రీనివాసరావు, శ్రీశైల ప్రభ సంపాదకులు అనిల్‌కుమార్, ఏఈఓలు హరిదాస్, ఫణిధర్ ప్రసాద్, మోహన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్న, సూపరింటెండెంట్లు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.

NT-311821-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794


# జూస్.. తాగితే జోష్..



పళ్లరసాలు తాగుతున్న ప్రజలు



కల్వకుర్తి పట్టణంలో పళ్లరసాలతో సేద తీరుతున్న ప్రజలు

- పళ్ల రసాలకు భలే గిరాకి..
- ఉష్ణతాపం నుంచి ఉపశమనం

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 7 : వేసవికాలం వచ్చిందంటే ఒకవైపు ఎండలు... మరో వైపు దాహార్తితో ప్రజలు గురవుతారు. దీంతో కొబ్బరి బోండాలు కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్, నిమ్మరసం, మజ్జిగ ఎక్కువగా తీసుకుంటారు. కొబ్బరి బోండాల ధరలు ఆకాశానంటుతుండడంతో దాహార్తిని తగ్గించుకోవడానికి మెల్లమెల్లగా పళ్లరసాల వైపు అడుగులు వేస్తున్నారు. గతంలో పెద్దపెద్ద పట్టణాలలో, నగరాల్లో మాత్రమే లభ్యమయ్యే పళ్ల రసాలు ఇపుడు పట్టణాలకు విస్తరిస్తున్నాయి. రొటీన్ ఉండే పళ్ల రసాలు ద్రాక్ష, పైనాపిల్, బత్తాయిలతో పాటు మరో పదిరకాల పళ్ల రసాలను, లస్సీలో వివిధ ఫ్లేవర్‌లలో తయారు చేసి అందిస్తుండడంతో పళ్ళరసాల ప్రియులు తమకు నచ్చినవి తాగుతూ ఫ్లేవర్‌లను ఎంజాయ్ చేస్తున్నారు. కూల్‌డ్రింక్‌ల కన్నా వందశాతం పళ్ళలో విటమిన్లు సమృద్ధిగా లభిస్తుండడంతో పళ్లరసాలకు రోజు రోజుకీ గిరాకీ పెరుగుతోంది. రొటీన్‌గా కాకుండా కొంగొత్త రకాల పళ్లరసాలు ఆకర్షణీయమైన ధరలలో విక్రయిస్తుండడంతో పళ్ల వ్యాపారులకు భలేగిరాకీ లభిస్తోంది. కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్‌తో పాటు పలు చౌరస్తాలలో పళ్లరసాల దుకాణాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి చూసిన ఏ ఒక్కరైనా తప్పకుండా తాగి పోయే విధంగా ఫ్రెష్‌గా తయారు చేసి అందిస్తున్నారు. గతవారం పది రోజులుగా ఎండలు మరింత మండడంతో పట్టణానికి వచ్చి వెళ్లేవారు లస్సీషాప్‌లు, జ్యూస్ సెంటర్‌ల వైపు వెళ్తున్నారు. కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తా, హైదరాబాద్ చౌరస్తా, బస్టాండ్, పలుచోట్ల జ్యూస్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో వాటికి మంచి గిరాకీ లభిస్తోంది.

### రూ.30నుంచి మొదలుకుని రూ.100వరకు..

పళ్లరసాల ధరలు ప్రజలు ఇష్టపడి తీసుకునేలా కూల్‌డ్రింక్ ధరలకు ఇంచుమించుగా సమానంగా ఉండడంతో పళ్ల రసాలకు మంచి గిరాకి ఉంటోంది. పళ్ల లభ్యతను బట్టి రూ.30 మొదలుకుని రూ.100 వరకు విక్రయిస్తున్నారు. పైనాపిల్, బత్తాయి, ద్రాక్ష, స్ట్రాబెర్రీ, ఆపిల్, సపోట, కివి, డ్రాగన్ ఫ్రూట్, జామ, అంజీర్, అరటి, పుచ్చకాయ, కర్భూజ, లిచి, అవోకాడో, కాక్‌టేల్, బీట్‌రూట్, ఫ్రూట్ పంచ్, క్యారెట్, మల్బరీ, దానిమ్మ, ఆరంజ్, బొప్పాయిలతో పాటు పలు రకాల సలాడ్ రసాలు ఇరవైకి పైగా నోరూరించే వాటిని వినియోగదారుడు కోరిన వెంటనే ఫ్రెష్‌గా అందిస్తుండడంతో వినియోగదారులకు చక్కటి ఆరోగ్యం కలిగిస్తోంది.



జూస్ కేంద్రంలో ..

## రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- పుస్తకావిష్కరణసభలో వక్తలు



పుస్తకాన్నిఆ విష్కరిస్తున్న వక్తలు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 7 : భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని వక్తలు పేర్కొన్నారు. పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక, సమతా కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో దొండి లక్ష్మీనారాయణ రచించిన భారత రాజ్యాంగం-ఒక విశ్లేషణ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గుడిపల్లి నిరంజన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జై భీమ్ దీక్ష వ్యవస్థాపక అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత దొండి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన సామ్యవాదం ఇప్పటికీ నెరవేరలేదన్నారు. ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలని అప్పుడే సామ్యవాదానికి అర్థం చేకూరుతుందన్నారు. వంకేశ్వరం నిరంజన్ మాట్లాడుతూ ఉన్నత కులాల వాళ్లు రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నారని, అదే రాజ్యాంగాన్ని బహుజనులు కాపాడాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే దళిత, బహుజనులు హక్కులు కోల్పోయి బానిసత్వంలోకి నెట్టబడతారన్నారు. కార్యక్రమంలో వార్డెన్ చెన్నయ్య, పెద్దన్న, డీటీయూ జిల్లా కన్వీనర్ కొంగరి జానయ్య, చంద్ర సిద్దార్థ, పరశురాం, విష్ణుమూర్తి, బంగారయ్య, రామచందర్, కాశీ దాస్, విజయకాంత్, పెబ్బేటి మల్లికార్జున్, బీసీటీపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, చందర్, వెంకటయ్య, పచ్చిపాల సుబ్బయ్య, లక్ష్మణ్ నాయక్, కాజా,కాశన్న, భాస్కర్, శ్రావణ్,శివ పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

అచ్చంపేట, ఏప్రిల్ 7: ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని పార్టీ నాయకులు శంకర్‌మాదిగ, వంశీనాయక్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చి న హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రజలను మరోసారి మోసం చేస్తుందన్నారు. ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు.

## అబద్ధాలు మాట్లాడిన రాహుల్ గాంధీ

వంగూరు, ఏప్రిల్ 7 : తుక్కుగూడలో జరిగిన జనజాతర సభలో రాహుల్‌గాంధీ వచ్చి అబద్ధాలు మాట్లాడటం దుర్మార్గమని మండల బీఆర్ఎస్ నేతలు సైదులు, అంజీలు ఆదివారం ప్రకటనలో విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నిరుద్యోగులకు 30వేల ఉద్యోగాలు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి రాసిచ్చిన స్క్రిప్టు చదివి రాహుల్ తెలంగాణ ప్రజల దృష్టిలో అసమర్థుడయ్యాడన్నారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు

లింగాల, ఏప్రిల్ 7: మండలంలోని అంబట్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు.

## గాయపడ్డ విద్యార్థి మృతి

వెల్దండ, ఏప్రిల్ 7 : మండలంలోని బుడ్డోన్‌పల్లికి చెందిన ప్రశాంత్ (15) గతయేడాది రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అయితే గత 10నెలలుగా మంచానికే పరిమితమై ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కల్వకుర్తి వీబీస్ పాఠశాలలో 9వతరగతి చదువుతున్నాడు.

## ఇసుక టిప్పర్ల పట్టివేత

బిజినేపల్లి, ఏప్రిల్ 7: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై నా గశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు కోయిల్‌సాగర్ నుంచి బిజినేపల్లికి టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసు సిబ్బందితో మండలంలోని వడ్డేమాన్ శివారులో వాహనాలను తనిఖీచేయగా ఎలాంటి అనుమతులు లేకుం డా ఇసుకను తరలిస్తున్న రెండుటిప్పర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## వ్యక్తి ఆత్మహత్య

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 7: ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బల్మూరు మండలం గోదల్‌కు చెందిన వావిలాల సుభాష్‌రెడ్డి(35)కు రంగాపూ ర్ గ్రామానికి చెందిన లోహితతో గతేడాది వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవతో రెండు నెలల క్రితం లోహిత తల్లిగారింటికి వచ్చింది. సుభాష్ రెడ్డి ఆదివారం అత్తగారింటికి వచ్చాడు. ఇంట్లో భార్య లేకపోవడంతో కోపంతో ఇంట్లోని టీవి, ఇతర వస్తువులను హెల్మెట్‌తో పగలగొట్టడంతో అక్కడే ఉన్న లోహిత చెల్లెలు భయంతో పరుగులు తీసిందన్నారు. సుభాష్ రెడ్డి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌తో ఇంట్లో చల్లడంతో పాటు ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీంతో చుట్టుపక్కల వారు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి అచ్చంపేట సర్కారు దవాఖానకు తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు 50శాతం పైగా కాలడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు రెఫర్ చేశాగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుభాష్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

## ముస్లింలకు పండ్లు పంపిణీ

అచ్చంపేట, ఏప్రిల్ 7: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని అటవీశాఖ ఉద్యోగి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పట్టణంలోని మసీదుల్లో ముస్లింలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖాజా, సాధిక్, గౌస్‌మైనొద్దీన్, సాజిద్, హాజీ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ





సమావేశంలో మాట్లాడుతున్న బాలనర్సింహ

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 7: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బాలనర్సింహ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో హాల్లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ఏనాడూ పేదల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోలేదన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేస్తూ దేశంలో కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభు త్వ సంస్థలను నడపడానికి చేతకాక ప్రైవేట్ వ్యక్తులైన అంబానీ ఆదానీలకు ఒక్కొక్కటిగా అప్పచెబుతున్నారన్నారు. ఈడీ, సీబీఐ ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉపయోగించుకొని ప్రతిపక్ష పార్టీల నాయకులపై దాడులు చేయిస్తున్నారన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ మాట్లాడుతూ ఎవరైనా తాము చేసిన అభివృద్ధిని చూపి ఓట్లు అడుగుతారు కానీ నరేంద్ర మోదీ మాత్రం కులం, మతాన్ని అడ్డుపెట్టుకొని దేవుళ్ల పేరు చెబుతూ ఓట్లు అడుగుతున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు బహిరంగంగా చెప్పటం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, కే.కేశవులుగౌడ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, ఆర్.శ్రీను, ఆంజనేయులు, ఈర్ల చంద్రమౌళి, కృష్ణాజీ, లక్ష్మిపతి పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థులసమ్మేళనం



పెద్దాపూర్ ఉన్నత పాఠశాలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వెల్దండ, ఏప్రిల్ 7 : మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010-11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాలా ఏండ్ల తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గురువులను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

### ప్రశాంతంగా మోడల్ ప్రవేశ పరీక్షలు

వెల్దండ, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలోని ఆదివారం మోడల్‌స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 6 వ తరగతిలో ప్రవేశానికి 360 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా 289మంది హాజరయ్యారు. 7,8,9,10 తరగతిలో ప్రవేశానికి 530కి గానూ 433 మంది హాజరయ్యారు.

## ప్రథమ చికిత్సా కేంద్రం సీజ్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 7: జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న విజయ ప్రథమ చికిత్స కేంద్రంలో గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్ చేస్తున్నారనే సమాచారంతో శనివారం రాత్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుధాకర్‌లాల్, తాసీల్దార్, ఎస్ఐలతో కలిసి తనిఖీ చేశారు. ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకులు ఎటువంటి అర్హత, అనుమతులు లేకుండా అబార్షన్లు చేస్తున్నట్లు గుర్తించి ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి తెలిపారు. ఆయన వెంట అదనపు ఆరోగ్యశాఖ అధికారి వెంకటదాసు, ప్రోగ్రాం అధికారి రవికుమార్ ఉన్నారు.

# తాండ్ర వద్ద బారికేడ్లు ఏర్పాటు

- శాశ్వత చర్యలు తీసుకోవాలి





బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

కల్వకుర్తి, ఏప్రిల్ 7 : మండలంలోని తాండ్ర గ్రామం వద్ద ఆదివారం పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారిపై తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు తాత్కాలికంగా రోడ్డుపై ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. రెండురోజుల కిందట తాండ్ర గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మోటరు సైకిల్‌పై కల్వకుర్తి వైపు మళ్లుతుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ ప్రమాదం జరిగిన తీరుపై తాండ్ర గ్రామస్తుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. తాండ్ర గ్రామం వద్ద రోడ్డు నిర్మాణం లోపభూయిష్టంగా జరగడం వల్లనే తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తుల నుంచి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమైంది. తాండ్ర గ్రామ గేటు వద్ద గ్రామస్తులందరు ధర్నా చేసేందుకు నిర్ణయించుకున్న నేపథ్యంలో స్పందించిన పోలీసులు తాత్కాలికంగా రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

### లోపభూయిష్టంగా హైవే నిర్మాణం

తాండ్ర గేటు వద్ద కోదాడ-జడ్చర్ల ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి స్థాయిలో లోపభూయిష్టంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఎన్‌హెచ్ నిబంధనల మేరకు 200 మీటర్ల వరకు ఎదురుగా వచ్చే వాహనం కనబడేలా రోడ్డు నిర్మాణం ఉండాలి. తాండ్ర గ్రామం వద్ద కల్వకుర్తి వైపు నుంచి వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కూడా కనబడవు. ఈ కారణం చేత ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాండ్రగ్రామ గేటు నుంచి కల్వకుర్తి వైపు వెళ్లే రోడ్డు దాదాపు 4మీటర్ల మేర కిందకు తవ్వి రోడ్డు వేయాల్సి ఉంది. ఇదేమి పట్టించుకోకుండా అధికారులు, గుత్తేదారులు యథావిధిగా రోడ్డు వేయడంతో దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఈ కారణం చేతనే ఇప్పటివరకు 10మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. సరాసరిన చిన్నవి, పెద్దవి కలిసి రెండు మూడు రోజులకొక ప్రమాదం జరుగుతుంది.

### డివైడర్లు ఏర్పాటు చేయాలి

తాండ్ర గ్రామ గేటు వద్ద ప్రమాదాలు కాకుండా శాశ్వతంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. బారికేడ్ల ఏర్పాటు వల్ల పూర్తి స్థాయిలో ప్రమాదాలు నివారించడం కష్టమని, రాత్రివేళల్లో బారికేడ్ల వల్ల కొత్త ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని వాహన చోదకులు అంటున్నారు. తాండ్ర గేట్ వద్ద లైట్లు లేకపోవడం, ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల వెలుగులో బారికేడ్లు సరిగ్గా కనిపించక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాహన చోదకులు అంటున్నారు. శాశ్వత పద్ధతిన నివారణ చర్యలు చేపట్టడంతో భాగంగా రోడ్డును మూడు, నాలుగు మీటర్ల వరకు కిందకు దించడం లేదా, డివైడర్ ఏర్పాటు చేయడంతో పాటు, డివైడర్ పైన హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. మండలంలోని మార్చాల వద్ద కూడా ఇలాంటి సమస్య ఎదురైన క్రమంలో గ్రామస్తులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో క్రమంలో అక్కడ డివైడర్‌లను ఏర్పాటు చేశారు. తాండ్ర గ్రామం వద్ద కూడా శాశ్వత చర్యలు చేపట్టే విధంగా ఈ ప్రాంత ప్రజా ప్రనినిధులు చొరవ తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. తాత్కాలిక చర్యల వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.